**కథ**

# తథాస్తు

**ఆకునూరి మురళీకృష్ణ**

## ఒకరోజు..

## టైము ఎనిమిదిన్నరయింది.

**సుందరి తెల్లవారురఝామున నాలుగున్నరకి లేచి, ఇల్లంతా శుభ్రం చేసుకుని, పిల్లల్ని లేపి స్కూలుకి రెడీచేసి, మొగుడికి భోజనం వండి హాట్ క్యారియర్‌లో సర్ది టిఫిన్ రెడీ చేసి డైనింగ్ టేబిల్ మీద హాట్ ప్యాక్‌లో వుంచింది.**

పిల్లలకింకా స్కూలికి టైమవ్వకపోవడంతో పక్కగదిలో కూర్చుని చదువుకుంటున్నారు.

కాఫీ కలిపి ఫ్లాస్కులో పోసి, నిమిష నిమిషానికీ టైము చూసుకుంటూ బెడ్‌రూమ్‌లోంచి వచ్చే 'కాఫీ' అన్న పిలుపుకోసం ఎదురుచూడసాగింది.

కృష్ణకుమార్ మంచం మీద బోర్లాపడుకుని రైలింజన్‌లా గుర్రు పెడుతూ నిద్రపోతున్నాడు.

సుందరి వంటింట్లోంచి బెడ్‌రూమ్ గుమ్మందాకా కాలుకాలిన పిల్లిలా తిరుగుతూ ఇల్లంతా నీట్‌గా ఎక్కడ వుండాల్సిన వస్తువులక్కడ సక్రమంగా వున్నాయో లేదో నని ఒకటికి పదిసార్లు సరిచూసుకుంటోంది.

కృష్ణకుమార్ ఇంటా బయటా కూడా పరమస్ట్రిక్టు! అంతా పెర్‌ఫెక్ట్‌గా వుండాలంటాడు. ఎదుటి మనిషిలో ఏమాత్రం చిన్న లోపం వున్నా భరించలేడు. దానికితోడు కోపం కూడా ఎక్కువ కావడంతో అందరికీ అతనంటే సింహస్వప్నమే! సుందరికైతే మరీనూ.

ఇంట్లో ఎంత పెర్‌ఫెక్ట్‌గా వున్నా అతనికేదో లోపం కనిపిస్తూనే వుంటుంది. అందుకే అతను ఆఫీసుకెళ్ళేదాకా టెన్షన్. ఆఫీస్ నుంచి ఇంటికొస్తే టెన్షన్. అతనింట్లో లేని సమయంలోనే ప్రాణానికి కాస్త హాయిగా వుంటుంది.

ఏదో ఆలోచిస్తున్న సుందరికి బెడ్‌రూమ్‌లోంచి పెద్దగా 'ధబ్' మన్న శబ్దం వినిపించి ఖంగారుగా బెడ్‌రూమ్‌లోకి పరిగెత్తింది.

నిద్దట్లో మంచం మీద నుంచి దొర్లి కింద పడ్డాడు కృష్ణకుమార్!

ఆ శబ్దమే ఆమెకి వినిపించింది.

అతన్నలా చూస్తుంటే సుందరికి నవ్వొచ్చింది.

"అయ్యో" అంటూ అతన్ని లేవదీసింది, వస్తున్న నవ్వునాపుకుంటూ. జరిగిందేమిటో అర్ధమవ్వగానే కృష్ణకుమార్‌కి ఒళ్ళు మండిపోయింది.

"అయ్యో ఏమిటి అయ్యో..నిద్రలేవగానే తిన్నగా నడుచుకుంటూ వంటింట్లోకెళ్ళిపోవడమేనా? పక్కన పడుకున్న మనిషి దొర్లి కిందపడిపోకుండా దిండు అడ్డం పెట్టాలన్న జ్ఞానం వుండక్కర్లేదూ?" అన్నాడు కసురుకుంటూ.

'దిండు అడ్డం పెట్టడానికి మీరేమైనా చంటిపిల్లాడా?' అందామనుకుని అతని గురించి తెలుసుకనుక ఆగిపోయి "సారీ అండీ..కాఫీ ఇమ్మంటారా?" అంది.

"సరే తగలెట్టు..టైమెంతయిందీ?" అంటూ గోడగడియారం వంక చూసి కెవ్వుమంటూ గట్టిగా అరిచాడు.

"మళ్ళీ ఏమయిందండీ..నడుముగానీ నొప్పి చేసిందా?" కంగారుగా అడిగింది.

"నేను అరిచింది అందుక్కాదు. టైము ఎనిమిదిన్నర అవుతున్నా నన్ను లేపకుండా ఏం చేస్తున్నట్లు?" రుసరుసలాడాడు.

"మీరే కదండీ..ఆఫీసులో అలసిపోయి వస్తాను. నాకు ఎక్కువ రెస్టు కావాలి అంటారు? అందుకే లేపలేదు" అంది సుందరి భయంగా.

"అది రోజూ సంగతి. ఇవాళ ఆఫీసులో ఇన్స్‌పెక్షను వుంది. తొమ్మిదింటికే ఆఫీస్‌కి తగలడాలి" చిరాగ్గా అన్నాడు.

"ఆ సంగతి నాకు తెలియదు కదండీ"

"అందుకే నాకు ఒళ్ళుమండుతుంది. తెలియకపోతే తెలుసుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకోబోయే ముందు మర్నాడు చేయాల్సిన పనులేంటో లిస్టు రాసుకోమని లక్షసార్లు చెప్పాను. ఒక పద్ధతీ పాడూ లేదు..ఛీ..ఛీ.." చిర చిరలాడుతూ కాఫీ త్రాగకుండానే బాత్రూమ్‌లోకి దూరాడు కృష్ణకుమార్.

'ఓరి దేవుడా! ఈ మొగుడితో ఎలా వేగాలిరా నాయనా' గాల్లోకి చూస్తూ అనుకుంది సుందరి.

★ ★ ★

ఇంకో రోజు..

"మనిషన్నాక ఒక పద్ధతుండాలండీ..అలా పద్ధతి ప్రకారం నడుచుకోలేని మనుషులంటే నాకు పరమ చిరాకు. మీకు ముందే చెప్పాను నేను నా సంగతి, నా డిసిప్లిన్ సంగతీ. మన అలవాట్లు, అభిరుచులు ఎంత గొప్పవైనా కావచ్చు, కానీ అవి ఇతరులని ఇబ్బంది పెట్టకూడదు"

అరగంట నుంచీ ఊక దంపుడుగా వాయించేస్తున్నాడు కృష్ణకుమార్.

వాళ్ళింట్లో అద్దెకుంటున్న ఖర్మానికి ఏదో పెద్ద నేరం చేసినవాడిలా తలొంచుకు వింటున్నాడు కూర్మావతారం.

ఇంతకీ ఆయన చేసిన నేరమేమిటంటే ప్రొద్దున్నే దేవుడ్ని తల్చుకుందామని వెంకటేశ్వర సుప్రభాతం కేసెట్ పెట్టుకోవడమే!

ఎటొచ్చీ వీధి అరుగుమీద కూర్చుని వత్తులు చేసుకుంటున్న వాళ్ళ అమ్మగారికి వినపడాలని వాల్యూమ్ కొంచెం పెంచినమాట నిజమే.

వాళ్ళ గ్రహస్థితి బాగోలేక సరిగ్గా అదే సమయానికి కృష్ణకుమార్‌కి ఫోన్ వచ్చింది. కార్డ్‌లెస్‌లో మాట్లాడుతూ వీధిలోకి వచ్చిన అతనికి ఆ సౌండ్ డిస్టర్‌బెన్సు అయింది. ఫలితంగా ఇప్పుడీ కోర్టు సీను!

ఇంకో అరగంట ఉపన్యసించాక కనికరించి, "సరే వెళ్ళండి" అంటూ వదిలిపెట్టాడు.

"భగవంతుడా!" అంటూ మనసులోనే గట్టిగా అరిచాడు కూర్మావతారం.

"సొంతిల్లు కట్టుకోలేకపోయిన చిన్న నేరానికి నన్నీ మూర్ఖుడితో నానా మాటలు పడేలా చేస్తావా? నీకిది న్యాయం కాదు" అంటూ వాపోయాడు.

★ ★ ★

మరో రోజు..

భయంతో గుమాస్తా ఏకలింగం గుండెలు దడ దడలాడిపోతున్నాయి. కారణం ఆరోజు ఆయన ఆఫీస్‌కి రావడం ఐదు నిముషాలు లేటయింది. అంతేకాదు, ఆఫీసుకొచ్చే ముందే గుర్తుకు వచ్చింది. అంతకు ముందురోజు ఆయన తయారుచేసిన స్టేట్‌మెంట్లో చిన్న తప్పుదొర్లింది.


అసలే బాస్ కృష్ణకుమార్ చండశాసనుడు!

తన కేబిన్లోకి అడుగు పెట్టిన ఏకలింగాన్ని మింగేసేలా చూడసాగాడు కృష్ణకుమార్.

"ఇరవయ్యేళ్ళ సర్వీసుంది. కానీ ఏం లాభం? ఒక చిన్న స్టేట్‌మెంట్ పెర్‌ఫెక్ట్‌గా వెయ్యడం చేతకాదు. ఆఫీస్‌కి ఒక్కరోజూ కూడా టైమ్‌కి రావడం అలవాటు లేదు"

"బస్సు లేటయింది సార్.." అంటూ ఏదో చెప్పబోయాడు.

"బస్సులు లేటుగానే వస్తాయి. రైళ్ళు లేటుగానే నడుస్తాయి. కానీ మనం పెర్‌ఫెక్ట్‌గా వుండాలండీ. ఆఫీస్ టైముకి పావుగంట ముందుగానే ఆఫీస్‌లో వుండేలా ప్లాన్ చేసుకోవాలి. అప్పుడు బస్సు లేటయినా ఇబ్బంది వుండదు. ఇన్ఫర్మేషన్ కరెక్టుగా తీసుకుంటే స్టేట్‌మెంట్లో తప్పులు రావు" అంటూ రెచ్చిపోయాడు.



అర
గంట సేపు కుర్చీలకేసీ గోడలకేసీ చూస్తూ నిల్చున్నాడు ఏకలింగం.

"సరే...ఇకనుంచైనా పెర్‌ఫెక్ట్‌గా వుండడం నేర్చుకో" అంటూ పంపేశాడు.

'వీడికి ట్రాన్సఫరైనా రాదేం' తన సీట్లో కూలబడుతూ అనుకున్నాడు ఏకలింగం.

'ఓరి బ్రహ్మదేవుడా! నాకింకా ఎన్నాళ్ళు రాసి పెట్టావురా ఈ ఛాదస్తపు బాస్‌తో' తల కొట్టు కుంటూ అనుకున్నాడు.

* * *

"వింటున్నారా?" నాలుగు తలకాయల్తో జోగుతూ నిద్రపోతున్న బ్రహ్మదేవుడ్ని పట్టి కుదుపుతూ అడిగింది సరస్వతీదేవి.

"ఏమిటీ?" అన్నాడు బ్రహ్మదేవుడు కళ్ళు తెరవకుండానే.

"మీ వల్ల ప్రజలు పడుతున్న కష్టాలు! నేనెన్నో వ్యయప్రయాసల కోర్చి సుందరికీ కూర్మావతారానికీ ఏకలింగానికీ విద్యాబుద్ధులనిచ్చేను. కానీ మీ విధిలిఖితంతో అంతా తారుమారు చేసి వాళ్ళనిబ్బంది పెడుతున్నారు" అంది కంప్లయింట్ చేస్తున్నట్లుగా.

"నేను తారుమారు చేయడమేంటి?" ఆశ్చర్యంగా అన్నాడు బ్రహ్మ.

"అలా ఏం తెలియనట్లడుగుతారేం? తెలివితేటల్లోనూ, ఐ.క్యూ.లోనూ కృష్ణకుమార్ మిగిలిన ముగ్గురి కాలిగోటికి కూడా సరిపోడు. కానీ వాళ్ళ ముగ్గురి మీదా అధికారం చెలాయిస్తున్నాడు. ఎందుకు? అతను భర్త-సుందరి భార్య, అతను ఇంటి ఓనరు-కూర్మావతారం అద్దెకున్నవాడూ, అతను ఆఫీసరు-ఏకలింగం గుమాస్తా కాబట్టే కదా? ఇదంతా మీ 'విధి లిఖితం' వల్ల కాదా?" సీరియస్‌గా అడిగింది.

బ్రహ్మ కళ్ళు తెరచి చిన్నగా నవ్వేడు.

"మనుషుల ప్రవర్తన జన్మ జన్మల నుండి వాళ్ళు అలవర్చుకున్న సంస్కారం వల్ల వస్తుంది. అంతే తప్ప విధి లిఖితం వల్ల వాళ్ళ మనస్తత్వం మారిపోదు" అన్నాడు.

"మీరన్నది నాకర్థం కావడం లేదు" అంది సరస్వతీ దేవి.

"సరే..ఎలాగూ నామీద నేరం మోపావు కదా? నువ్వు కోరుకున్నట్లుగానే కాసేపు సుందరిని భర్తగా, కృష్ణకుమార్‌ని భార్యగా, కూర్మావతారాన్ని ఓనర్‌గా, కృష్ణకుమార్‌ని టెనెంట్‌గా, ఏకలింగాన్ని బాస్‌గా, కృష్ణకుమార్‌ని గుమాస్తాగా మారుస్తాను. జరిగేది చూడు" అన్నాడు బ్రహ్మ.

* * *

ఆరోజు..

బ్రహ్మదేవుడిచ్చిన వరం వల్ల 'సుందర'గా మారిన సుందరికి మహదానందంగా వుంది. ఇప్పుడింక తెల్లవారుఝామున లేచి హడావిడిపడుతూ ఇల్లు సర్దుకుని వంట చేసుకోవాల్సిన బాధలేదు. ఆ బాధ్యతలన్నీ భార్య కృష్ణకుమారివి!

హాయిగా ఎనిమిదింటికి నిద్ర లేవచ్చు. లేచేసరికి ఇల్లు నీట్‌గా లేకపోతే సరదాగా కృష్ణకుమారిని పిలిచి

తిట్టచ్చు!

తనకి కావాల్సినట్లుగా తనుండవచ్చు. ముఖ్యంగా కృష్ణకుమార్‌కి భయపడుతూ బ్రతకక్కర్లేదు.


ఆనందంతో రాత్రంతా సరిగ్గా నిద్రపట్టలేదు. పొద్దున్న ఆలస్యంగా నిద్రలేద్దామనుకునేంతలోనే వంటింట్లోంచి దబదబా బాదినట్లు గిన్నెల శబ్దాలు వినపడసాగాయి.

వెను వెంటనే కృష్ణకుమారి కంఠం ఖంగుమంటూ వినిపించింది.

"బారెడు పొద్దెక్కేదాకా మంచం దిగకుండా దున్నపోతులా నిద్రపోయే వాళ్ళంటే నాకు పరమ చిరాకు. టైముకి పడుకోవాలి. టైముకి నిద్రలేవాలి. మనిషన్నాక ఒక పద్ధతంటూ ఉండాలి"

## స్పెషాలిటీ

**కలువకన్నుల కమలినీ ముఖర్జీ నిర్మాతల దృష్టిలో మంచి హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకుంది. నంది అవార్డు గెల్చుకున్న ఈ భామ ఆనంద్ తర్వాత ఇప్పుడు గోదావరిగా జనాన్ని అలరించేందుకు సిద్ధం అవుతోంది. ఆనంద్ చిత్రం లాగే ఈ చిత్రం తనకి మంచి పేరు తెస్తుందని భావిస్తోంది కమలినీ. ఇందుకు కారణం కూడా లేకపోలేదు. శేఖర్ కమ్ముల వైవిధ్యభరితమైన దర్శకత్వం ఈచిత్రానికి అసెట్ అంటున్నారంతా. జివిజి.రాజు నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో గ్రామీణ నేపథ్యం ప్రస్ఫుటంగా కన్పిస్తుందంటున్నారు.**



హడలిపోతూ లేచికూర్చున్నాడు సుందర్.

ఎలాగో గొంతు పెగల్చుకుని "కాఫీ" అన్నాడు.

కాఫీ కాదు కదా..మంచినీళ్ళు కూడా ఇవ్వలేదు కృష్ణకుమారి. ఒకసారి బెడ్‌రూమ్‌లోకి వచ్చి సీరియస్‌గా అతన్ని చూసి వెళ్ళిపోయింది.

ఇల్లంతా చిందరవందరగా ఎలాపడితే అలా వుంది.

'ఇల్లిలా పెట్టావేం? కొంచెం సర్దుకోవచ్చు కదా?' అందామనుకున్నాడు. అంతలోనే మళ్ళీ గయ్ మని లేచింది కృష్ణకుమారి.

"తీసిన వస్తువులు తీసిన చోట పెట్టమని లక్ష సార్లు చెప్తాను. వినిపించుకోరు. ఇల్లు చూడండి. ఎంత ఛండాలంగా వుందో. మీరెప్పటికి బాగుపడతారో నాకు అర్థం కావడం లేదు"

చేసేది లేక తనే ఇల్లు సర్దడం మొదలుపెట్టాడు సుందర్.

ఎలాగోలా వంట అయిందనిపించి ఆఫీసుకి బయలుదేరింది కృష్ణకుమారి. గేటు తీస్తుంటే ఇంటి ఓనర్ కూర్మావతారం ఎదురయ్యాడు.

ఆయన్ని చూస్తూనే ఆగిపోయింది కృష్ణకుమారి.

"ఏంటండీ..ప్రొద్దున్న మేం టేప్‌రికార్డర్ పెట్టుకుంటే డిస్టర్‌బెన్స్‌గా వుందన్నారట మీ పిల్లలు? నాకు తెలియక అడుగుతాను. వెంకటేశ్వర సుప్రభాతం పెట్టుకుంటే ఏం డిస్టర్బెన్సండీ? ఫోనొస్తే వీధిలో తిరుగుతూ మాట్లాడుకోవాలా? ఇంట్లో మాట్లాడుకోండి. ఇంతింత అద్దె చెల్లించి వుంటున్నాం. మమ్మల్ని సౌకర్యవంతంగా వుంచాలన్న ఇంగితం వుండాలి. మీ పిల్లలకి కొంచెం పద్ధతి నేర్పించండి" అంటూ దులిపేసింది.

ఆయన విస్తుపోయి చూస్తూ "అలాగేనమ్మా..వాళ్ళకి చెబుతాలే" అన్నాడు.

ఆమె ఆఫీసుకి చేరుకునే సరికి అరగంట పైగానే లేటయింది.

సీట్లో కూర్చుంటూనే టైపుమిషన్ మీద వున్న కవర్ తీసి ధన్‌మని పక్కకి విసిరి కొట్టింది. బర్రమంటూ మిషన్లోకి కాగితాల నెక్కించింది 'ఛీ..ఛీ..వెధవ బస్సులు..ఒక్కటి టైముకి రావు' అనుకుంటూ.

సరిగ్గా అదే సమయానికి అటుగా వస్తున్న బాస్ ఏకలింగం ఆమెని చూస్తూ "ఏమ్మా..లేటయిందా?" అన్నాడు.

"మన గవర్నమెంటుకి బస్సులని టైముకి నడపడం చాతకాదు. ట్రాఫిక్‌ని కంట్రోల్ చేయడం రాదు. మీకు కూడా ఆఫీస్ స్టాఫ్‌కి ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాటు చేద్దామన్న ఆలోచన రాదు..ఇంక లేటవకేమవుతుంది?" అంది విసురుగా.

"అదిసరేగానీ..నిన్న నువ్వు తయారుచేసిన స్టేట్‌మెంట్లో తప్పులున్నాయి" అంటూ ఏదో చెప్పబోయాడాయన.

"ఉండవామరి? మీరు నాకిచ్చిన ఫైళ్ళలో అదే ఇన్ఫర్మేషన్ వుంది. నేనూ అదే రాసాను. అందుకే అంటాను నేను అన్నీ పర్‌ఫెక్ట్‌గా వుండాలని. లేకపోతే ఇలాగే వుంటుంది. ఇందులో నా తప్పేం లేదు" అంది తల కూడా పైకెత్తకుండా.

చేసేది లేక కేబిన్‌లోకి దూరాడు ఏకలింగం.

* * *

సరస్వతీదేవి విస్తుపోతూ చూస్తోంది కృష్ణకుమారిగా మారిన కృష్ణకుమార్ ప్రవర్తనని.

బ్రహ్మ చిద్విలాసంగా నవ్వాడు.

"ఇప్పటికైనా ఒప్పుకుంటావా విధిలిఖితం వల్ల మనుషుల ప్రవర్తన మారదని? కృష్ణకుమార్ లాంటివాళ్ళు ఎప్పుడూ ఎదుటివాళ్ళు కచ్చితంగా వుండాలనుకుంటూ వుంటారు. వాళ్ళు ఎదుటి వాళ్ళ స్థానంలోకి వెళ్ళినా అలాగే అనుకుంటారు. ఎ..దు..టి వాళ్ళు కచ్చితంగా వుండాలని!"

బ్రహ్మ చెప్పిన లాజిక్‌ని ఆశ్చర్యంగా వింది సరస్వతీదేవి.

"ఒప్పుకుంటాను. కానీ మీ నిజాయితీ నిరూపించుకోవడానికి మీరు వారి వారి స్థానాలని మార్చేసారు. దీనివల్ల సృష్టిలో అనర్థాలేం జరగవు కదా?" అంది.

"జరగవు. ఇదంతా నా మాయవల్ల జరిగిన నాటకం. తక్షణం నేను వాళ్ళని వాళ్ళ అసలు స్థానాల్లోకి మార్చేస్తున్నాను"

"అయితే ఇప్పుడు జరిగిన విషయాలేం వాళ్ళకి గుర్తుండవా?" ఆందోళనగా అడిగింది సరస్వతీదేవి.

"వుండవు"

"స్వామీ..నాదో చిన్న కోరిక..తీరుస్తారా?"

"ఏమిటి?"

"కృష్ణకుమార్‌కి తప్ప మిగిలిన వాళ్ళకి జరిగినదంతా కనీసం కలగానైనా గుర్తుండేలా వరం ప్రసాదించండి" గోముగా అడిగింది.

"దానివల్ల ప్రయోజనం ఏమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు బ్రహ్మ.

"ముందు వరమివ్వండి చెబుతాను" అంది సరస్వతీదేవి.

బ్రహ్మ "తథాస్తు" అని "ఇప్పుడు చెప్పు..ఏమిటి ప్రయోజనం?" అన్నాడు.

సరస్వతీ దేవి సంతోషంగా నవ్వింది.

"ముల్లుని ముల్లుతోనే తీయాలి. వజ్రాన్ని వజ్రంతోనే కోయగలం. కృష్ణకుమార్‌లాంటి వాళ్ళకెలా సమాధానం చెప్పాలో మిగిలిన వాళ్ళకి కల ద్వారా తెలియచెప్పాలని నా తాపత్రయం" అంది.

'మంచి ఆలోచనే సుమీ' అనుకున్నాడు బ్రహ్మ.

*